క్లుప్తంగా

సావిత్రిబాయికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆదివారం సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బేర బాలకిషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో మహిళలకు విద్య నేర్పిన గొప్ప మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. కార్యక్రమంలో రవిందర్‌కుమార్, ఆనంద్‌కుమార్‌గౌడ్, లోకేష్‌గౌడ్, రాకేష్‌గౌడ్, కబీర్దాస్‌గౌడ్, శంకర్‌బాబు పాల్గొన్నారు.

నేరాల అదుపులో కానిస్టేబుళ్ల పాత్ర కీలకం

హస్తినాపురం: క్షేత్ర స్థాయిలో నేరాలను అదుపు చేయడంతో కానిస్టేబుళ్ల పాత్ర కీలకమని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశిరెడ్డి అన్నారు. ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అంజిబాబు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. అంజిబాబుకు ఏసీపీ కాశిరెడ్డి పదోన్నతి బ్యాడ్జీని అలంకరించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, పదోన్నతి పొందిన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. నేరాలను అరికట్టడంలో క్షేత్రస్థాయిలో ఉండే కానిస్టేబుళ్ల పాత్ర కీలకమన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఏపీ చీఫ్ సెక్రటరీ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యంగిరా దేవి మహిమ గల దేవత అని అన్నారు. ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు వారికి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలోనూ జవహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు జంప జగన్, అయిత అంజయ్యగుప్తా, వరకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందిస్తూ అండగా ఉంటున్నాడు. ట్రస్టు నిధుల ద్వారా ఆర్థిక సాయం అందజేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి మండలం మార్చాలకు చెందిన సానమోని కృష్ణయ్య ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీంతో కృష్ణయ్య జెడ్పీటీసీని కలిసి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. తక్షణమే స్పందించిన జెడ్పీటీసీ వెంకటేశ్ ఇంటి నిర్మాణానికి ట్రస్టు ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేస్తానని భరోసానిచ్చారు. ఆదివారం ట్రస్టు సభ్యులతో స్లాబ్‌కు సరిపడా స్టీల్, సిమెంట్, కాంక్రీట్, ఇసుక, తదితర మెటీరియల్‌ను కృష్ణయ్యకు అందజేశారు. కార్యక్రమంలో భారత జాగృతి విద్యార్థి విభాగపు జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్, కిషోర్, సురేశ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాలాజిసింగ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

తలకొండపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి, అచ్చంపేట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన పీసీసీ అధికార ప్రతినిధి ఠాకూర్ బాలాజిసింగ్‌కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, సీనియర్ నేత దామోదర్ డేవిడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో బాలాజిసింగ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయంలో బాలాజిసింగ్ కృషి అమోఘమని, ఆయన చేసిన సేవలు మరువలేనిదన్నారు. అపార అనుభవం, అన్ని వర్గాల ప్రజలతో మమేకమై, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్న బాలాజిసింగ్‌కు ఎమ్మెల్సీ పదవీ ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానానికి దామోదర్ డేవిడ్ సూచించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 11, వంకాయ 33, బెండ 45, పచ్చిమిర్చి 65, కాకర 38 , బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 25, క్యారెట్ 33. దొండ 28, ఆలు 24, ఉల్లి 24, గోకర 35, దోస 18, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 55, అర్వి 45, మునగ 45, చిలగడదుంప 60, బీట్‌రూట్ 25, కీర 32, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 60.

కల్యాణం.. కమనీయం



శివపార్వతుల కల్యాణం చేస్తున్న వేద పండితులు



పసుపు, కుంకుమ, తలంబ్రాలు అందజేస్తున్న అనితారెడ్డి, సునితారెడ్డి

- నాలుగో రోజు కొనసాగిన బ్రహ్మోత్సవాలు
- భారీగా హాజరైన భక్తులు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయం ఓంకార నామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం అంగరంగ వైభవంగా కొనసాగింది. శివపార్వతులకు హారతి, అభిషేకం, కుంకుమార్చన, మంత్రపుష్పం, రుద్రాభిషేకం పలు ప్రత్యేక పూజలు చేశారు. శివగంగ చూట్టు కొలువుదీరిన పదహారు శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. శనివారం రాత్రి 10:30 గంటలకు వేద పండితుల సాక్షిగా ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. రాజరాజేశ్వర, రాజరాజేశ్వరీల వివాహం అంగరంగా వైభవంగా పండితుల సమక్షంలో నిర్వహించారు. శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు తీగల అనితారెడ్డి, పట్నం సునీతారెడ్డి , ఆలయ కమిటీ చైర్మన్ అల్లెకుమార్ దంపతులు, స్వామివార్లకు ఊరేగింపుగా వచ్చి పట్టు వస్త్రాలు సమర్పించారు. గ్రామ పురవీధుల గుండా శివపార్వతుల విగ్రహాలను బ్యాండు బాజాలు, బాణా సంచాలు కాల్చుతూ శోభాయాత్ర నిర్వహించారు. కల్యాణ ఘట్టాన్ని కనులార వీక్షించి భక్తులు ఆనంద పరవశంలో మునిగిపోయారు. కల్యాణాన్ని వేద పండితులు వర్ణించిన తీరు ఆనందడోలికల్లో ముంచెత్తింది.ఆర్ధరాత్రి ఆలయం ఆవరణంలో కళాకారులు, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, రంగస్థల నాటకాలు, భక్తి గీతాలు అలపించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలతో భారీ బందోబస్తు నిర్వహించారు.

అలరించిన జబర్దస్త్ ఫేమ్స్

మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జబర్దస్త్ ఫేమ్స్ బుల్లెట్ భాస్కర్, రాకేశ్, ఫైమా, రేలా రేలా సింగర్స్ స్కిట్లు, డైలాగ్స్, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

ప్రత్యేకపూజలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్లు తీగల అనితారెడ్డి, పట్నం సునితారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి శివగంగ రాజరాజేశ్వర ఆలయం జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఆలయ డైరెక్టర్లు మోదిని రాకేష్, అల్లె రాకేష్, స్వర్ణగంటి కన్నయ్య, జగన్ ముదిరాజ్, సాయిలు, శ్రీశైలం ఆలయ ఈఓ మురళి కృష్ణ, ఆలయ మాజీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవానికి ముస్తాబైన శివపార్వతులు



శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి భారీగా హాజరైన భక్తులు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: అధికారంలో ఉన్నప్పటికీ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. మాల్ గ్రామానికి చెందిన బట్టు శ్రీనివాస్‌ను యాచారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో నియమాకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవుల కోసం కాకుండా పార్టీ గెలుపు కోసం కృషి చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలో ఎంపీ ఎన్నికలు రాబోతున్నాయని, గెలుపే లక్ష్యంగా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ సాధించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



కడ్తాల్: పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పిప్పల వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం నాయకులతో పాటు యువకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు రవి, రాజేందర్‌యాదవ్, రవీందర్‌రెడ్డి, శంకర్, రాజేశ్, మహేశ్, దాసు, ప్రవీణ్‌గౌడ్, అశోక్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు. యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మాధవులు, నాయకులు మహేశ్, సంజీవ్, రాఘవేందర్, వెంకటేశ్, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

మహిళల హక్కుల కోసం అలుపెరగని పోరాటం సాగించిన వీర వనిత సావిత్రిబాయి పూలే అని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో పూలే వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబ, నాయకులు భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌అలీ, మల్లేశ్‌గౌడ్, కడారి రమేశ్, శ్రీకాంత్, ఇమ్రాన్ బాబ, భరత్‌యాదవ్, రమేశ్, మోత్యా పాల్గొన్నారు.

అసంపూర్తిగా తుమ్మలూరు బీటీ రోడ్డు

త్వరగా పూర్తి చేయాలని ప్లకార్డులతో నిసరసన

మహేశ్వరం: అసంపూర్తిగా ఉన్న బీటీ డబుల్ రోడ్డు నిర్మాణం పనులను త్వరితగతంగా పూర్తి చేయాలని గ్రామ యువకులు ఆదివారం శ్రీశైలం జాతీయ రహదారిపైన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో శ్రీశైలం జాతీయ రహదారి(తుమ్మలూరు గేటు) నుంచి మహేశ్వరం మండల కేంద్రం వయా తుమ్మలూరు వరకు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.14.20 కోట్ల నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించింది. రోడ్డును వెడల్పు చేసి ఎత్తు పెంచడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. నిత్యం ఈ రోడ్డుపై నుంచి పలు గ్రామాల ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డుపైన వెళ్లడంతో వాహనాలు త్వరగా మరమ్మతులకు గురవడంతో పాటు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని యువకులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఈ రోడ్డుపై ప్రమాదాలకు గురై ఎంతో మంది ఆస్పత్రి పాలయ్యారని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, రోడ్డు కాంట్రాక్టర్, అధికారులు స్పందించి రోడ్డు అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తుమ్మలూరు గ్రామం నుంచి యువకులు ర్యాలీగా వెళ్లి, శ్రీశైలం జాతీయ రహదారిపై ప్లకార్డులతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. మహే శ్వరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని చెదరగొట్టి ట్రాఫిక్ క్లీయర్ చేశారు. కార్యక్రమంలో గ్రామ యువజన సంఘాల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న యువకులు

విజ్ఞాన ప్రదర్శనలు.. మేధోమథనానికి వేదికలు



పహాడీషరీఫ్: ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



మీర్‌పేట: సదస్సులో మాట్లాడుతున్న సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: విజ్ఞాన ప్రదర్శనలు.. విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడతాయని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ క్యూబా కాలనీ షైన్ మోడల్ హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను పరిశీలించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పచ్చదనం పెంపొందించడం, నీటి పరిశుభ్రత పాటించడం, చంద్రయాన్-3 లాంటి ఆలోచింపజేసే ఎగ్జిబిట్లను రూపొందించి, విద్యార్థులు తమ ప్రతిభను చూపారని కొనియాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పిల్లలకు గుణాత్మక విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కళాశాలను అప్‌గ్రేడ్ చేయాలి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూర దృష్టితో మైనార్టీల కోసం ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలను.. డిగ్రీ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు యూసుఫ్ పటేల్, ఉమర్ బామ్, షేక్ అఫ్జల్, సయ్యద్ ఫెరోజ్, పాఠశాల చైర్మన్ సయ్యద్ నూరు ద్దీన్ అలీ ఆబేద్, ప్రిన్సిపాల్ మునీరుద్దీన్ అలీ, డైరెక్టర్ వలీయొద్దీన్, హెచ్‌ఓడి సాదియాబేగం పాల్గొన్నారు.

రాజకీయాల్లో 'రాణి'ంచడం సాధ్యమే

మీర్‌పేట: ఇంట్లో కుటుంబాన్ని అన్ని రకాలుగా తీర్చిదిద్దుకుంటున్న మహిళలకు.. రాజకీయాల్లో రాణించడం సాధ్యమేనని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ నందిహిల్స్‌లో మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో మహిళలకు రాజకీయం సాధ్యపడదని, కేవలం సర్పంచ్, ఎంపీటీసీలకే పరిమితమనే వారని గుర్తు చేశారు. నేడు స్త్రీలకు అన్ని రంగాల్లో రాణించే సత్తా ఉందన్నారు. ముఖ్యంగా చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కావాలన్న డిమాండ్ భవిష్యత్తులో నెరవేరాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం మహిళలు ఎమ్మెల్యేను సత్కరించారు. సదస్సులో బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతరెడ్డి, ఐద్వా నాయకురాలు బుగ్గవీటి సరళ, రచయిత్రి డి.కమల, త్రిపుర, రామిడి జ్యోతి, డా.సైదా, విజయలక్ష్మి, శ్వేత, అరుణ, రవళి, రజిత, ఉమా, పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పది



అన్నదానంలో పాల్గొన్న వకులాభరణం కృష్ణమోహన్

రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం

దిల్‌సుఖ్‌నగర్: అన్ని దానాల్లో కెల్లా అన్నదానమే గొప్పదని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. ఎంత విలాసవంతంగా జీవించినప్పటికీ పది మంది ఆకలి తీర్చడంలో పొందే ఆత్మసంతృప్తి మరువలేనిదన్నారు. ఆదివారం రామకృష్ణాపురంలోని శ్రీశైవ క్షేత్ర ప్రాంగణంలో మహాశివరాత్రి అనంతర తొలి అమావాస్య సందర్భంగా మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణమోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు అర్చక స్వాములు, వేద పండితులు శైవ క్షేత్ర ప్రాంగణంలో కొలువై ఉన్న పంచలింగాలకు, పంచామృతాలచే అభిషేకం చేశారు. కార్యక్రమంలో శైవ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు కోటేశ్వరావు, వనిత శక్తి అధ్యక్షురాలు హైమ, రమేష్ గుప్తా, సీతారాం, మల్లేష్ యాదవ్, కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మంచాల: మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర కంటి వైద్యశాల, ఫినిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 82 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 17 మందిని కంటి ఆపరేషన్ కోసం నగరంలోకి శంకర కంటి వైద్యశాలకు తరలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, డాక్టర్లు మన్‌ప్రీత్‌కౌర్, ప్రవతి, రమేశ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్ : రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా పెద్దఅంబర్‌పేటకు చెందిన దాసరి నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి జారీ చేసిన నియామకపత్రాన్ని ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీద గా నర్సింగ్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఉన్న తనపై విశ్వాసంతో జిల్లా కాంగ్రెస్ పార్టీలో చోటు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మల్‌రెడ్డిరాంరెడ్డి, పెద్దఅంబర్‌పేట కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, చిరంజీవి, రాజేందర్, గంటా శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌లు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

యాచారం: యువతకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నందివనపర్తి గ్రామంలో జ్యోతి ఎడ్యుకేషన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. గెలుపొందిన జట్టుకు ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.30వేల విలువ చేసే ఫోర్స్ లైట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించి మంచి గుర్తింపు పొందాలన్నారు. క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించే విషయంలో బీఎస్ఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. చంద్రశేఖర్‌రెడ్డిని క్రీడాకారులు ఘనంగా సత్కరించారు.



ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న క్రీడాకారులు

ఘనంగా అమావాస్య హోమం



భక్తులకు ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి



కొనసాగుతున్న హోమం

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని నిఖిల్ చేతనా కేంద్రంలో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు గురూజీ తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ.. మానవ సేవనే మాధవ సేవని, ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వారికి ఏదో విధంగా సహాయపడాలన్నారు. ఆధునిక సమాజంలో ఎదురైయ్యే ఆటుపోట్లను తట్టుకుని నిలబడాలంటే సాధనకు మించిన మార్గం మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మల్లప్పగుట్ట శివాలయంలో ప్రత్యేక పూజలు

తలకొండపల్లి: మల్లప్పగుట్ట శివాలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో గణపతిపూజ, అభిషేకం, చక్రతీర్థం, మంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మండల పరిధిలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట శివాలయంలో స్వామివారి పల్లకీ ఊరేగింపు అత్యంత శోభయామానంగా నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య దేవతామూర్తులకు మంగళహారతితో పూజలు నిర్వహించారు. కనుల పండువగా కొనసాగిన ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య కార్యనిర్వాహకులు పెంటారెడ్డి, మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి, రంగారెడ్డి, బుచ్చి రెడ్డి, విజేందర్‌రెడ్డి, మల్యానాయక్, శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.